



ఉదయభానుడు తన లేత కిరణాల వెచ్చదనంతో జీవరాశిని చైతన్యవంతం చేస్తున్నాడు.

బస్సు హైదరాబాదు పొలిమేర ల్లోకి చేరుకుంది.

ముందుకు సాగుతున్న బస్సులో

సన్నగా అలజడి అలుముకుంది. గమ్యం దగ్గరవుతున్నకొద్దీ ప్రయాణీకులలో కొత్త ఉత్సాహం చోటు చేసుకుంటూంది. కాని రామనాధం మాష్టారి వదనంలో మాత్రం దిగులు స్పష్టంగా కనిపిస్తూంది.

అందుకు కారణం లేకపోలేదు. ఆయన భాగ్యనగరానికి రావటం ఇది మొదటిసారికాదు. 'ఈసారైనా తన పని సానుకూలపడుతుందా? లేదా?' అన్నదే ఆయనను వేధిస్తున్న ప్రశ్న. అది మనసులో మెదిలినప్పుడల్లా ప్రస్ఫుటమయ్యేదే ఈ దిగులు.

రామనాధం మాష్టారు రిటైరై ఆరు నెలలు కావస్తోంది. ఆయన పెన్షన్‌కు సంబంధించిన కాగితాలు కొన్ని పెండింగ్ వుండటంతో వాటిని కదల్చాలనే తలంపుతో కొంతకాలం క్రితం మొదటిసారిగా భాగ్యనగరం రావటం జరిగింది. కాగితాలు కదలాలంటే తగిన ముడుపు చెల్లించాలనే సత్యాన్ని వాటికి సంబంధించిన వ్యక్తి ద్వారా తెలుసుకోవటం జరిగింది. తన సర్వీసులో భుక్తి గడుపుకోవటమే కాని పైసా వెనకేయని ఆయన ఏమివ్వగలడు? అందుకే ఆయన పని జరగలేదు.

అప్పటికి ఎన్నో విధాల ప్రాధేయపడ్డారు. తన దీనస్థితిని వివరించారు. ఫలితం శూన్యం. గుండెను దిటవు పరుచుకొని, 'పోనీ ఈ కుర్రకుంక మనసు ఈరోజు కాకపోతే రేపు మారకపోతుందా? కాగితాలు ముందుకు జరగక పోతాయా?' అనే ఆశతో తన నిస్సహాయతను కప్పి పుచ్చుకుంటూ వెనుదిరిగి వెళ్ళిపోయారు.

కాని జరిగిందేమిటి? కొన్ని నెలల కాలం దొర్లటం, ఎంతో ఆశతో ఎదురుచూసిన తన కళ్ళు నిరాశతో వాలిపోవటం.

పెన్షన్‌వస్తే కాని ఇల్లు గడవని పరిస్థితి ఏర్పడింది. చుట్టూ వున్న మిత్రులసాయం పొందటం సుతరామూ ఇష్టంలేకపోయింది. తప్పని పరిస్థితులలో తనకు ఇష్టం లేకపోయినా భార్య మాట కాదనలేక ఆమె మెళ్ళో వున్న విలువైన ఆ ఒక్క వస్తువును కుదువపెట్టి బయలుదేరక తప్పింది కాదు.

ఒక్క కుదుపుతో హైదరాబాదు బస్‌స్టాండ్‌లో బస్ ఆగడంతో ఈ ఈ లోకంలోకి వచ్చారు రామధం గారు.

* * *

ఆఫీసుకు బయల్దేరిన రామనాధంగారి మనసు పరి పరి విధాల పోతూంది. 'ఈసారైనా పని ఏదో

విధంగా ముగించుకోవాలి. ఇంత కాలం తను ఎన్నో అవాంతరాలను ఎదుర్కొన్నాడు. తన జీవితాన్ని మచ్చలేకుండ సాగించాడు. ఈ క్రతువులో తన సహధర్మచారిణిని ఎన్నో కష్టనష్టాలకు తనతోపాటు గురి చేశాడు. చివరకు తనకు మిగిలిందేమిటి? కష్టాలు, కన్నీళ్ళు, కడుపుమంట. 'ఈ శేష జీవితంలోనయినా ఆవిడ సుఖశాంతులకు ప్రాముఖ్యత ఇవ్వాలి!' అదే ఇప్పటి ఆలోచన.

ఆఫీస్‌లో అడుగుపెట్టిన రామనాథంగారికి తన ప్రయాణానికి కారకుడైన వ్యక్తి సీటులో ప్రకాశం కనిపించడం అమితానందాన్ని కలిగించింది.

"ఏమోయ్, ప్రకాశం! కులాసానా?" అన్న పలకరింపుతో తనను 'ప్రకాశం' అని పిలవగలిగింది ఎవరా- అనుకుంటూ అంత వరకు పనిలో నిమగ్నమై వున్న ప్రకాశరావు తల ఎత్తి చూసాడు.

ఎదురుగా రామనాథం మాష్టారు కనిపించటంతో ఆదరంగా ఆహ్వానిస్తూ- "రండి, రండి మాష్టారూ! కూర్చోండి. మిమ్మలను ఎంతో కాలం తర్వాత చూడగలగటం నాకెంతో ఆనందంగావుంది. అంతా కులాసాయే కదూ?" అంటూ తన ఎదురుగా వున్న కుర్చీని చూపించాడు ప్రకాశరావు.

ప్రకాశరావు పూర్వాశ్రమంలో రామనాథంగారి శిష్యుడు. వారాలు చేసుకుంటూ చదువుకుంటున్న రోజులలో మాష్టారి అండదండలతో చదువు సాగించిన ప్రియశిష్యుడు. అటువంటి ప్రకాశం ఇప్పుడు ప్రయోజకుడయి తన కళ్ళకెదురుగా ప్రత్యక్షమైతే ఏ గురువు మాత్రం ఆనందించడు.

"అంతా కులాసానోయ్. ఇక్కడ ఎప్పుడు ప్రవేశించావు?" అడిగారు రామనాథంగారు.

"రెండు నెలలైంది మాష్టారు. ఇంతకుముందు ఈ సీటులో వున్న తనికి బదిలీకావటంతో వేరే సెక్షన్‌నుండి ఇందులోకి రావటం జరిగింది" అన్నాడు ప్రకాశరావు.

ప్యూనుని పిలిచి కాఫీకి ఆర్డరు జారీ చేశాడు.

అతనే తిరిగి ప్రసంగాన్ని కొనసాగిస్తూ-"ఎప్పుడు రాక మాష్టారు? ఏదో పనిమీద వచ్చినట్లున్నారు, చెప్పారు కాదు?" అన్నాడు.

"ఏమీ లేదోయ్! నా పెన్షన్ కాగితాలు ఆఫీసరుగారి సంతకాల కోసం నిలబడిపోవటంవల్ల రావటం జరిగింది. ఇంతకు క్రితం ఒకసారి వచ్చి వెళ్ళాను. కాని అప్పటి ఈ

సీటులోని వ్యక్తి అదిగో, ఇదిగో అంటూ తిప్పటంతో విసిగి వెళ్ళి పోవలసి వచ్చింది" అన్నాడు రామనాధంగారు

"అదెంతపని మాష్టారు! ఆందోళన చెందకండి. మీ పని అయ్యేటట్లు చూస్తాను" అన్నాడు ప్రకాశరావు.

కాఫీలు రావటంతో ఇద్దరూ సేవించారు.

"ఈ రోజు నేను తిరుగు ప్రయాణం కావాలోయ్! మరి నా పని ఎంత త్వరగా చేస్తావో?" మరో సారి తన అవసరాన్ని గుర్తు చేశారు రామనాధంగారు.

"అలాగే మాష్టారు. మీ పని అయిపోయినట్లు భావించండి. బయట విశ్రాంతి తీసుకోండి. మీ కాగితాలు సంతకాలు చేయించి అందజేస్తాను" అన్నాడు.

"మంచిది బాబూ!" అంటూ నిండుగా ఊపిరి పీల్చుకుంటూ బయటకు నడిచారు రామనాధం గారు.

బయటికి వచ్చిన రామనాధం గారికి ఎదురుగా వున్న చెట్టునీడ చల్లగా ఉన్నదనిపించటంతో చెట్టు క్రింద కూర్చున్నారు. ఆయన మనసు ఉల్లాసంతో వూగిసలాడుతూంది. అంతవరకు చెట్టుక్రింద ఎవరినీ గమనించని రామనాధం గారు తల ఎత్తగానే ఎదురుగా కనిపించిన కాంతారావుగార్ని చూసి ఆశ్చర్యపోయారు.

కాంతారావుగారు, రామనాధం గారు కొంతకాలం ఒకేచోట పని చేయటం జరిగింది. అదే వారి సాన్నిహిత్యానికి కారణం.

"నమస్కారం కాంతారావు గారూ! ఏమిటీ అనుకోని దర్శన భాగ్యం?" పలకరించారు ముందుగా చూసిన రామనాధంగారు.

"మీరా మాస్టారూ! బహుకాల దర్శనం. కులాసాయే కదూ? నేనేదో పరధ్యానంలో వుండి, మిమ్మల్ని గమనించలేదు. పెన్షన్ కాగితాల కోసం రావటం జరిగింది" అన్నారు కాంతారావుగారు.

"అలాగా! అయితే పని పూర్తయిందా?"

"ఎక్కడ పూర్తి కావటం మాస్టారు. గత రెండు రోజులుగా తిరుగుతున్నా, పని ఏ కొసకూ రాలేదంటే నమ్మండి! మనబోటి వాళ్ళకు ఇవి రోజులు కావండి. అన్నట్లు మీరెందు కొచ్చారో చెప్పారు కాదు?" అన్నారు కాంతారావుగారు.

"నేను వచ్చింది కూడా అదే పని మీదండి. నా ఒకప్పటి

శిష్యుడే ఇప్పుడు మన పని చూడవలసిన ప్రకాశరావు. ఇప్పుడే కలిసి మాట్లాడివచ్చాను. ఈరోజు నా పని పూర్తి చేయిస్తానన్నాడు. మీరేమీ దిగులపడకండి! పనిలో పని మీ గురించి కూడా చెప్పి వస్తాను" అంటూ సెక్షన్ వైపు నడిచారు రామనాధంగారు.

కాదనలేని కాంతారావుగారు కృతజ్ఞతా భావంతో రామనాధంగారు వెళ్ళినవైపు చూస్తూ నిలబడిపోయాడు.

* * *

చెట్టుకింద కూర్చున్న రామనాధం, కాంతారావుగారి మనసుల్లో చోటు చేసుకున్న భయమల్లా-'తమ పనులు యీ రోజు పూర్తవుతాయా? లేదా?' అన్నదే. ప్రకాశరావును కలిసివచ్చిన రామనాధంగారికి దొరికిన సమాధానమల్లా 'ఇదిగో ఒక అరగంటలో మీ పని పూర్తవుతుంది' అని. కాని ఇప్పటికి అదే అరగంట నాలుగుసార్లుగా వారిని వెక్కిరించి వెళ్ళిపోయింది. అందుకే ఆ ఆత్రుత.

"సార్! మిమ్మల్ని గత రెండు రోజులుగా యీ చెట్టు క్రింద చూస్తున్నాను. మీరు వచ్చిన పని నాకు తెలియంది కాదు. మీ పని సులభంగా పూర్తయ్యే మార్గం నా దగ్గరవుంది" అన్నాడు అప్పుడే వచ్చిన ఓ అగంతకుడు కాంతారావుగార్ని ఉద్దేశిస్తూ.

అంతవరకు ఎవరో తెలియని యీ అగంతకుడు తన పని పూర్తయ్యే మార్గం చూపిస్తాననటంతో, "చూడు బాబూ! నీవెవరో నాకు తెలియకపోయినా పనయ్యే మార్గం చూపెడతాననటం వల్ల అదేమిటో తెలుసుకోవటం నా కర్తవ్యంగా భావిస్తాను" అన్నారు కాంతారావుగారు—నీవు చెప్పదల్చుకున్నదేదో చెప్పమన్నట్లుగా.

"నాకు తెలుసు మాస్టారు! మీ పెన్షన్ కాగితాలు యీ రోజు సంతకం కాకపోతే మీరు చాలా ఇబ్బంది పడవలసి వస్తుంది. రేపు ఆఫీసరుగారు క్యాంపుకు వెళుతున్నారు. ఎల్లుండి శనివారం. అటు తరువాత ఆదివారం కావటంతో ఇక మీ పని సోమవారం వరకు జరగదు. ఈ మూడురోజులు యీ మహాపట్నంలో మీరు వుండటానికి ఎంత లేదన్నా కనీసం వందరూపాయలకు తక్కువ ఖర్చు కాదు. పైగా ఒక్క ఖర్చే కాకుండా కాలాయాపన కూడ. మీరు ఊఁ...అంటే ఏభై రూపాయలు మీవి కావనుకుంటే అర

గంటలో మీ పని పూర్తి చేసుకొని బయలుదేరవచ్చు. ఆలోచించండి!" అన్నాడు అగంతకుడు.

అనుకోని ఈ పరిణామానికి ఆశ్చర్యపోయినా తన అవసరం గుర్తుకొచ్చిన కాంతారావుగారు రామనాధంగార్ని ఉద్దేశిస్తూ—

"మాష్టారు! ఇంతవరకు మీ మాటమీద గౌరవంకొద్ది పని అవుతుందనే ఆశతో ఎదురుచూడటం జరిగింది. అటువంటి సూచనలు ఏమీ కనుపించటంలేదు. మీరేమీ అనుకోనంటే నా ఏర్పాటు నేను చూసుకోక తప్పేటట్లు లేదు" అన్నాడు.

"సరే, అయితే మీ ఇష్టం" అన్నారు రామనాధంగారు నిర్లిప్తంగా.

అప్పటికే అగంతకునితో మంతనాలు ముగించిన కాంతారావుగారు అతనికి తన సమ్మతిని తెలియజేయటం, అగంతకుడు సెక్షన్ వేపుకు నడవటం రామనాధంగారి ముందే జరిగిపోయింది.

అరగంట గడవకముందే చేతిలో కాగితాలతో వుల్లాసంగా తిరిగి వచ్చిన అగంతకుని చూసిన కాంతారావుగారి మొహం పద్మంలా వికసించింది. కాంతారావుగారు కాగితాలను పరిశీలనగా చూసి అగంతకునికి ముడుపు చెల్లించారు.

సాలోచనగా రామనాధంగారి వంక చూస్తూ-

"మాష్టారు! మీతో ఒక విషయం చెప్పాలనుకుంటున్నాను. ప్రకాశరావు మీకు మాత్రమే శిష్యుడు కాదు. అతను ఒకప్పుడు నాకు కూడా శిష్యుడే" అన్నారు కాంతారావుగారు.

"ఏమిటీ! మరి నాకెందుకు చెప్పలేదు?" అన్నారు రామనాధంగారు తన ఆశ్చర్యాన్ని వ్యక్తపరుస్తూ.

"మీరు ముందుగా అతను నా శిష్యుడుఅని చెప్పటంతో ఇంకమీరు ఏమి చెబుతారోనని మిన్నకున్నాను. అతన్ని మీరు ముందుగా పలకరించడం వల్ల మిమ్మలను అతను గుర్తించినట్లు ప్రకటించక అతనికి తప్పింది కాదు. ఆ విధంగా నే మీకు ప్రకాశరావు మర్యాద ఇస్తున్నట్లుగా నటిస్తున్నాడు కాని మీమీద అతనికి నిజమైన ప్రేమాభిమానాలు వున్నాయనుకోవటం లేదు నేను." తన అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు కాంతారావుగారు.

"అలా అని ఎలా చెప్పగలరు?"

"నేను అతనిని ముందుగా పలకరించక పోవటంతో అసలు నేనెవరో తనకి తెలియనట్లుగా వుండిపోయాడు. అప్పుడే అతను

నాకు సాయపడడని తెలుసుకున్నాను."

"అటువంటి నిర్ణయానికి వచ్చిన మీరు నాకు చెప్పి వుండవలసింది!"

"మీరు-అతను నా శిష్యుడు మీ పని చేయించి పెడతాను అన్న తరువాత మీ మనసు నొప్పించటం ఇష్టంలేక ఊరుకున్నాను. అయినా చదువుకునే రోజుల్లో వాళ్ళు మన శిష్యులుగాని ఇప్పుడు కావనే విషయాన్ని మనం గుర్తుంచుకోవాలి. ఇంకా వాళ్ళు మనను గౌరవించాలి అనుకోవటం మన స్వార్థం తప్ప మరోటి కాదు. కనుక ఇప్పటికైనా మీ ప్రయత్నం మీరు చేసుకోవటం మంచిదని భావిస్తాను" అంటూ శలవు తీసుకున్నారు కాంతారావు గారు.

అంతవరకు తన పని కాక పోదన్న ధీమాతో కూర్చున్న రామనాధం మాష్టారు కాంతారావుగారి మాటలతో తన పని ఎంతవరకు చేశాడోనన్న ఆతృతతో ప్రకాశం దగ్గరకు వెళ్ళారు. అప్పటికే అగంతకుడు ప్రకాశరావు చేతిలో నోట్లు వుంచి వెళుతుండటం, ప్రకాశరావు వాటిని చిరునవ్వుతో జేబులో పెట్టుకోవటం రామనాధంగారి కంట పడింది.

ప్రకాశం ఆంతర్యాన్ని గ్రహించిన రామనాధం మాష్టారు వెంటనే వెనుదిరిగారు అగంతకుని కోసం. ●

---

# విజయ

# చందా వివరాలు

| | |
|---|---|
| సంవత్సర చందా | 42 రూ॥ |
| అర్ధసంవత్సర చందా | 21 రూ॥ |
| విడి ప్రతి | 3-50 రూ॥ |